సాక్షి
నారాయణపేట

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



ఇద్దరు.. నాలుగేసి సార్లు

మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో ఇద్దరు నాలుగేసి సార్లు ప్రాతినిధ్యం వహించారు.

వివరాలు IIలో ▸



భారీగా నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది.

వివరాలు IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
42.7 /23.1

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత మొదలవుతుంది. మధ్యాహ్నం వడగాలుల ప్రభావం ఉంటుంది.

ఆలోచించి ఓటేయండి..

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

- బీజేపీ 'పాలమూరు'కు జాతీయ హోదా ఇచ్చిందా..
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసిందా..
- పని చేసే వారికి ఓటు వేస్తేనే బతుకులు బాగుపడతాయి..
- మహబూబ్‌నగర్‌లో మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలి..
- రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌కు ప్రజల బ్రహ్మరథం



బస్సులో నుంచి నమస్కారం చేస్తున్న గులాబీ బాస్ కేసీఆర్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'మోదీ దేశాన్ని పదేళ్లు పాలించిండు.. ఇప్పటి వరకు వంద నినాదాలు చేసిండు.. అందులో ఒక్కటి కూడా నిజం చేయలేదు. పాలమూరు వెనుకబడ్డ ప్రాంతం.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయహోదా కోసం వంద ఉత్తరాలు రాసినం.. బతిమాలినం.. అయినా ఇవ్వలేదు. మోదీవి కట్టుకథలు, పిట్టకథలు. ఆయన వల్ల ప్రజలకు ఏం లాభం జరిగింది?' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫైర్ అయ్యారు. 'డీకే అరుణ ఐదేండ్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నారు. ఆమె పాలమూరు ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా తీసుకొచ్చిందా.. మరి ఏమని ఓట్లు అడుగుతున్నారు?' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ బస్సు యాత్రలో భాగంగా మూడో రోజు శుక్రవారం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా కేసీఆర్ పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'ఈ ఎన్నికల్లో మూడు పార్టీలు నిలబడ్డాయి.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ.. ఒక్కసారి ఆలోచన చేయండి. ఎవరు పని చేస్తరో.. ఎవరు న్యాయంగా ఉంటారో.. వాళ్లకు ఓటేస్తేనే మన బతుకులు బాగుపడుతాయి. పని చేయని వాళ్లకు వేస్తే ఇబ్బంది పెడుతరు.' అని హితవు పలికారు.



- **బీజేపీ వాళ్లంతా అక్కరకు రాని చుట్టాలు. అక్కరకు రాని చుట్టం.. మొక్కితే వరమివ్వని వేల్పు.. మోహరమున ఎక్కినరాని గుర్రం.. గక్కున** విడువగ వలయును. మన కన్ను మనం పొచుకునేందుకు బీజేపీకి ఓటేయాలా? అంటూ కేసీఆర్ కవిత్వం చదివి వినిపించారు.

మాట్లాడుతున్న కేసీఆర్

హామీల అమలు రేవంత్‌కు చేతనైత లేదా..

'నీ గుడ్లు పీకి గోటిలాడుకుంటా.. నీ పేగులు చీల్చి మేడలో వేసుకుంటా.. నీ చెడ్డీ గుంజుకుంటా.. చర్లపల్లి జైల్లో వేస్తా అని రేవంత్‌రెడ్డి నన్ను అంటడు. ఇదేం మర్యాద? 15 ఏండ్లు అందరూ కలిసి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నం. దానికి నాయకత్వం వహించిన నేను రాష్ట్రం కోసం ప్రాణాలు పోయే దాకా తెగబడి పోరాడినా. నన్ను పట్టుకుని ఇన్ని మాటలంటుండు. నీకు ఇచ్చిన హామీలు అమలు చేసే చేతనైత లేదా? నీకు చేసే దమ్ము ఉంటే చేయాలె. అంతేగాని దేవుని మీద ఒట్ల రాజకీయాలు చేస్తే ఎవరూ నమ్మరు' అని కేసీఆర్ ధ్వజమెత్తారు.

ఈ ప్రభుత్వం మెడలు వంచాలి..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా.. ఇంత వరకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. కానీ లూటీ మాత్రం జరుగుతోంది. రెసిడెన్షియల్ స్కూళ్లలో విషాహారం తిని విద్యార్థులు చనిపోతున్నా.. చూసే దిక్కు లేదు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడం లేదు. ఈ ఎన్నికల్లో రైతులు, యువత కులమతాలకతీతంగా ప్రభుత్వం మెడలు వంచాలి. అని పిలుపునిచ్చారు. పాలమూరు పార్లమెంట్‌లో మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించి బీఆర్ఎస్‌కు బలం చేకూర్చాలని కోరారు. రోడ్‌షోలో మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- కేసీఆర్ ముస్లింలనుద్దేశించి కాసేపు ఉర్దూలో ప్రసంగించారు. 'బీఆర్ఎస్ ఎప్పటికీ సెక్యూలర్‌గా ఉంటదని అంటూ.. మహబూబ్‌నగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉందన్నారు.' ఈ స్థానంలో కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ ఒకటే.. బీజేపీకి ఓటేసినా బీజేపీ గెలుస్తుంది.. కాంగ్రెస్‌కు ఓటు వేసినా బీజేపీనే గెలుస్తుంది.' అని పేర్కొన్నారు.



మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తా కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

పాలమూరుకు బతుకుదెరువు చూపిన కేసీఆర్

మాజీ సీఎం కేసీఆర్ పాలమూరుకు బతుకుదెరువు చూపారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అమాయక పాలమూరు ప్రజలు, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ హామీలకు మోసపోయి గెలిపించారన్నారు. ప్రజలు నమ్మకంతో ఓట్లేసి గెలిపిస్తే అధికారం చేపట్టిన కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. 14 రోజులకోసారి నీళ్లొచ్చే పరిస్థితి నుంచి రోజూ నీళ్లు వచ్చేలా బీఆర్ఎస్ హయాంలో చేస్తే మళ్లీ వారానికోరోజు నీళ్లు.. ఇదేం దుస్థితి అని ఎద్దేవా చేశారు.

బస్సు యాత్ర సైడ్‌లైట్స్

- సాయంత్రం 7.12 గంటలకు బస్సుయాత్ర ద్వారా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లికి చేరుకున్నారు.
- కేసీఆర్ బస్సుయాత్రలో బీఆర్ఎస్ జెండాలతో కార్యకర్తల బైక్‌లు, వాహనాల ర్యాలీ
- కేసీఆర్ బస్సు వెంట పరుగులు తీసిన జనం
- క్లాక్‌టవర్ వద్ద కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో సీఎం.. సీఎం అంటూ నినాదాలు
- జిల్లాకేంద్రంలోని ప్రధాన కూడళ్లన్నీ గులాబీ జెండాలతో నిండిపోయాయి.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



ఊట్కూరు: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కలిపించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఊట్కూరు మండలంలోని బిజ్వార్, పెద్దజట్రం, ఊట్కూరులలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, పర్నీచర్ ఇతర వసతులు ఏర్పాటు చెయ్యాలని, ఓటర్ జాబితా ప్రకారం బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగా ఓటర్ స్లిప్‌లను అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మమత, సెక్రటరీ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీనివాసులు, బిఎల్ఓలు సునిత, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఇండియన్ రెవెన్యూ సర్వీస్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ వరుణ్ రంగస్వామి చెక్‌పోస్టు సిబ్బందికి అదేశించారు. శుక్రవారం కోస్గి కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని సంపల్లి, చంద్రకల్ చెక్‌పోస్టులను వద్ద వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఉన్న రెండు ఎస్ఎస్‌టీ టీంలు సరిపోవని, మరో టీంను కోస్గికి కేటాయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పట్టుబడ్డ నగదు, మద్యం రికార్డులను పరిశీలించారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

స్వయం ఉపాధిపై ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, కుట్టు మిషన్‌పై ఉచిత శిక్షణ అందిస్తామని సంచాలకులు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతోపాటు వసతి, భోజనం, యూనిఫాం, టూల్‌కిట్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి గల 18–45 ఏళ్లలోపు మహిళలు ఈ నెల 30లోపు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో గ్రామీణ నిరుద్యోగ యువత సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 95424 30607, 99633 69361లను సంప్రదించాలని కోరారు.

'ఉమామహేశ్వర' మార్కింగ్ ప్రారంభం



బల్మూర్: మండలంలోని మైలారం, బల్మూర్, అనంతవరం గ్రామాల శివార్లలో నిర్మించనున్న ఉమామహేశ్వర రిజర్వాయర్ బౌండరీ పెగ్ మార్కింగ్ పనులను శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఇరిగేషన్ డీఈ బాలస్వామి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొదటి దశగా మైలారం శివారులోని రైతులకు నోటీసులు ఇచ్చి, అందరి సమక్షంలో బౌండరీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే అనంతవరం, బల్మూర్ గ్రామాల శివార్లలో ఉన్న రైతులకు నోటీసులు ఇచ్చిన అనంతరం మార్కింగ్ పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివ, ఇరిగేషన్ ఏఈ రమేష్, సర్వేయర్ జనార్దన్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ శిబిరాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, జిల్లా యువజన క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కె.సురేష్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రం సుభాష్‌నగర్‌లోని పతంజలి యోగా సెంటర్, ఏనుగొండ అనాథ శరణాలయంలో నెల రోజులపాటు యోగా శిక్షణ ఉంటుందన్నారు. శిబిరాల్లో ప్రతిరోజు యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానంపై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గలవారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం సెల్ నంబర్లు 77939 74713, 90008 64990లను సంప్రదించాలని కోరారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కమిషన్ సూచన మేరకు రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ బృందాలను కేటాయించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ నేతృత్వంలో సాధారణ పరిశీలకులు సేవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో ఎన్ఐసీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలోని 867 పోలింగ్ కేంద్రాలకు 120 శాతంతో 1,040 పోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి నియోజకవర్గాలకు కేటాయించారు. ఒక్కొక్క పోలింగ్ బృందంలో ఒక పీఓ, ఒక ఏపీఓ, ఇద్దరు ఓపీఓలు ఉంటారు. నివాసం, పనిచేస్తున్న సొంత నియోజకవర్గ నిబంధనలు పాటిస్తూ మహిళలకు మినహాయింపు ఇస్తూ పారదర్శకంగా ర్యాండమైజేషన్ నిర్వహించారు. నారాయణపేట జిల్లా పోలింగ్ కేంద్రాలకు సైతం పోలింగ్ బృందాలను కేటాయించారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎన్ఐసీ డీఐఓ సత్యనారాయణమూర్తి, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ నాగార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాలానగర్, కల్వకుర్తిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, సెల్ నం.94909 57312ను సంప్రదించాలని చెప్పారు.

30న జాబ్‌మేళా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంఎస్ఎన్ లాబొరేటరీ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయ్యి 20 ఏళ్లలోపు వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. సమాచారం కోసం సెల్.63032 04295ను సంప్రదించాలని సూచించారు.

20 నామినేషన్ల తిరస్కరణ

- మహబూబ్‌నగర్‌లో ఏడు, నాగర్‌కర్నూల్‌లో 13 రిజక్ట్ చేసిన అధికారులు
- ప్రస్తుతం బరిలో 56 మంది.. 29 వరకు ఉపసంహరణ గడువు
- మాజీ ఎంపీ మందా జగన్నాథంకు బీఎస్పీ షాక్



మహబూబ్‌నగర్‌లో స్క్రూట్నీ నిర్వహిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు 75 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. శుక్రవారం అధికారులు 20 మందివి తిరస్కరించారు. ఇందులో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానానికి దాఖలైన 42 నామినేషన్లను శుక్రవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు సెవాంగ్ గ్యాచో భూటియా, నామినేషన్ వేసిన అభ్యర్థుల సమక్షంలో జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ స్క్రూట్నీ ప్రక్రియ చేపట్టారు. అభ్యర్థుల సమక్షంలో జరిపిన పరిశీలనలో 7 మంది నామినేషన్లు తిరస్కరణకు గురవగా.. 35 మందివి ఆమోదించారు.

తిరస్కరణకు గురైన ఏడుగురు వీరే..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో స్క్రూట్నీ నిర్వహించగా ఏడుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో ఎఐఎంఐఎం పార్టీ తరఫున నామినేషన్ వేసిన షేక్‌మున్నాభాషా, జనరాజ్యం అభ్యర్థి జేఎల్ ఆశీర్వాదం, స్వతంత్ర అభ్యర్థులు రామలింగప్ప, సభావట్ శ్రీనివాస్, ఎరమోని సురేందర్, కుర్వ నర్సింగప్ప, కె.లక్ష్మన్నల నామినేషన్లు తిరస్కరించారు.

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి 34 మంది అభ్యర్థులు 53 నామినేషన్లు దాఖలు చేయగా ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేశ్ జైవన్షీ, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ పరిశీలన చేపట్టారు. ఇందులో 13 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించామని, 21 మందివి ఆమోదించారు. అలాగే ఇక్కడి నుంచి నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎంపీ మందా జగన్నాథం నామినేషన్ సైతం తిరస్కరణకు గురవడం గమనార్హం. ఈయన బీఎస్పీ తరఫున నామినేషన్ వేయగా.. బీఫాం సమర్పించకపోవడంతో తిరస్కరించినట్లు తెలిసింది. స్క్రూట్నీ తర్వాత రెండు స్థానాల్లో 56 మంది నామినేషన్లు ఆమోదించారు. కాగా, సోమవారం వరకు ఉపసంహరణ గడువు ఉండగా.. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా అధికారికంగా ప్రకటించనున్నారు.


ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాల తనిఖీ



శ్రీసాయి స్కూల్ సెంటర్ పరిశీలించి బయటకు వస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

నారాయణపేట రూరల్: ఓపెన్ స్కూల్ (సార్వత్రిక విశ్వవిద్యాలయ) వార్షిక పరీక్షల రెండవరోజైన శుక్రవారం అధికారుల బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఉండగా వాటిని డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘని బృందంతో పాటు ఫ్లయింగ్‌స్కాడ్ రమేష్‌శెట్టి బృందం వేర్వేరుగా తనిఖీ చేశారు. ప్రతీ సెంటర్‌లో నాన్ టీచింగ్ సిబ్బందితో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా, పేపర్ లీకేజీ ఘటనలు జరగకుండా చూసుకోవాలని డీఈఓ ఆదేశించారు. శుక్రవారం ఉదయం పరీక్షకు డీవీఎం, గర్ల్స్ స్కూల్, గ్రౌండ్ పాఠశాలలో పదో తరగతికి 634 విద్యార్థులకు 544మంది హాజరుకాగా, 85హాజరుశాతం నమోదైంది. అదేవిధంగా శ్రీసాయి కళాశాల, కృష్ణవేణి, శ్రీనారాయణ, బ్రిలియంట్, శ్రీసాయి స్కూల్ కేంద్రాల్లోని ఇంటర్ పరీక్షకు 948కు 822మంది హాజరుకాగా 86హాజరు శాతం నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు గాను 47మందిని కేటాయించగా 43మంది హాజరయ్యారు.

అగ్ని ప్రమాదాలపై ఆస్పత్రిలో మాక్‌డ్రిల్



పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని కోవిడ్ భవనంలో శుక్రవారం జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అధిక వేడి వల్ల జరిగే అగ్ని ప్రమాదాలపై ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బందికి ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ చేసి చూపించారు. అధిక వేడికి అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి.. ముందస్తుగా వేడి వలన కలిగే ప్రమాద తీవ్రతను తగ్గించుకోవడానికి, నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సిలిండర్ వల్ల ఏర్పడే ప్రమాదాలు, వాటి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ చేసి చూపించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 డయల్ చేయాలని ఫైర్ మెన్ శివకుమార్ చెప్పారు. ఆర్ఎంఓలు శిరీష, శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ లీగ్‌లో జిల్లా మహిళా జట్టుకు మూడోస్థానం

మహబూబ్‌నగర్ క్రీడలు: అదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో శుక్రవారం ముగిసిన రాష్ట్రస్థాయి ప్రీమియం హ్యాండ్‌బాల్ లీగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా మహిళా జట్టు మెరుగైన ప్రతిభకనబరిచి మూడోస్థానంలో నిలిచింది. జట్టు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రెహమాన్, జియావుద్దీన్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి



రివార్డులు అందిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట: లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులంతా విధులు బాధ్యతగా నిర్వర్తించాలని ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ సూచించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. బోర్డర్ చెక్‌పోస్టులలో ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎన్నికల సమయంలో అక్రమంగా నగదు, లిక్కర్, బంగారం, ఇతర విలువైన వస్తువులు రవాణా జరుగకుండా చూడాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వారీగా పెండింగ్ కేసులు గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకొని పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా పరిధిలో రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేస్తూ వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించి ఎక్కువ మొత్తంలో కేసులను కాంప్రమైజ్ చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఎన్ లింగయ్య, డీసీఆర్బీ డీఎస్పీ మహేష్, ఎస్‌బి సిఐ రామ్ లాల్, సీఐలు శివ శంకర్, చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి, సోమ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

నారాయణపేట రూరల్: విధి నిర్వహణలో పోలీసులు అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. మక్తల్, మాగనూర్, ధన్వాడ, నర్వ పీఎస్‌లలో పలు కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన పోలీసులు అధికారులు, సిబ్బందిని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన అభినందించి రివార్డులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల మాన, ప్రాణాల రక్షణతో పాటు తప్పు చేసిన దోషులు, నేరస్తులను పట్టుకోవడంలో ధైర్యంగా వ్యవహరించాలన్నారు. కేసులు పూర్తి చేయడంలో పారదర్శకత కల్గి ఉండి ప్రజల విశ్వాసం చూరగొనాలన్నారు. పోలీసులపై నమ్మకం పెంచడంతో పాటు ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థకు జీవం పోయాలన్నారు. అనంతరం డీఎస్పీ ఎన్.లింగయ్య, ఎస్‌బీ సీఐ రామ్‌లాల్, మక్తల్, మరికల్ సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఎస్ఐలు భాగ్యలక్ష్మిరెడ్డికుర్మయ్య, రమేష్, డీసీఆర్బీ ఎస్ఐ సునీతతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలప్ప, మురళీకృష్ణ, లైజనింగ్ ఆఫీసర్ వేణుగోపాల్, కబీర్, రామాంజనేయులకు రివార్డులు అందించారు.

పాలమూరులో కేసీఆర్ బస్సుయాత్ర


మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ చౌరస్తాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్


రోడ్‌షోలో పాల్గొన్న గులాబీ శ్రేణులు


మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను భుజాలపైకి ఎత్తుకున్న కార్యకర్తలు


జడ్చర్లలో కేసీఆర్ బస్సుపై పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త దుర్మరణం


లీలావతి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలోని బస్‌డిపో సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం మేరకు.. లింగాలకు లీలావతి (45) గురువారం రాత్రి ఓ గర్భిణిని ప్రసవం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చింది. అనంతరం గర్భిణి భర్త ద్విచక్ర వాహనంపై తిరిగి గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. లీలావతి కుమారుడు దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సిబ్బంది సంతాపం..

లింగాల: శుక్రవారం లింగాల సీహెచ్‌సీ, అంబట్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు మృతదేహం వద్ద నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ఓ గర్భిణిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చేర్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని.. దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైలు కిందపడి మరో వ్యక్తి..

ఉండవెల్లి: జోగుళాంబ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం సుమారు 30 ఏళ్లున్న ఓ వ్యక్తి కర్నూలు నుంచి సికింద్రాబాద్ వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. చనిపోయిన వ్యక్తి 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని, నలుపురంగు డిజైన్ చొక్కా, బూడిద రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని.. కుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉందని వివరించారు. సెల్‌ఫోన్ పగిలిపోయిందని, చేతికి కింగ్స్ గడియారం ఉందన్నారు. సమాచారం తెలిసిన వారు గద్వాల రైల్వేస్టేషన్‌లో సంప్రదించగలరని పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

బాలానగర్: మండలంలోని బోడజానంపేటలో శుక్రవారం ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి (48) తాగుడుకు బానిసయ్యాడు. గురువారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి ఇంటిపై పడుకొని శుక్రవారం తెల్లవారుజామున లేచి చూసేసరికి చనిపోయి ఉన్నాడన్నారు. కొడుకు మృతిపై అనుమానం ఉందని తండ్రి రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

తాళ్ల నరసింహ్మాపురంలో మరొకరు..

కొల్లాపూర్ రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కొల్లాపూర్ మండలం తాళ్ల నరసింహ్మాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తాళ్ల నరసింహ్మాపురం గ్రామానికి చెందిన ఆవుల శివకృష్ణ (33) ఈనెల 24న వ్యక్తిగత పని నిమిత్తం ఎన్మన్‌బెట్లకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించగా.. గ్రామ సమీపంలోని మామిడి తోటలో శవమై కనిపించాడు. అతడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య లలిత, ఒక కుమారుడు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం

కొల్లాపూర్ రూరల్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొల్లాపూర్ మండలం బోడబండతండాలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. బోడబండతండాకు చెందిన కవిత (28) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త సురేష్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇద్దరు.. నాలుగేసి సార్లు



- పాలమూరు పార్లమెంట్ @ 1952
- 7 అసెంబ్లీ నియోజకవర్గాలు.. 17 సార్లు ఎన్నికలు


మల్లిఖార్జున్


రామేశ్వర్‌రావు


జైపాల్‌రెడ్డి


ముత్యాల్‌రావు


పులిరామస్వామి


కె.జనార్దన్‌రెడ్డి


విఠల్‌రావు


కేసీఆర్

పాలమూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన వారు..

ఏడాది	గెలుపొందిన వారి పేరు	పార్టీ
1952	జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్
1957	రామేశ్వర్‌రావు	కాంగ్రెస్
1962	ముత్యాలరావు	కాంగ్రెస్
1967	రామేశ్వర్‌రావు	కాంగ్రెస్
1971	రామేశ్వర్‌రావు	తెలంగాణ ప్రజాసమితి
1977	రామేశ్వర్‌రావు	కాంగ్రెస్
1980	మల్లిఖార్జున్	కాంగ్రెస్
1984	జైపాల్‌రెడ్డి	జనతాపార్టీ
1989	మల్లిఖార్జున్	కాంగ్రెస్
1991	మల్లిఖార్జున్	కాంగ్రెస్
1996	మల్లిఖార్జున్	కాంగ్రెస్
1998	జైపాల్‌రెడ్డి	జనతాపార్టీ
1999	జితేందర్‌రెడ్డి	బీజేపీ
2004	విఠల్‌రావు	కాంగ్రెస్
2009	కేసీఆర్	బీఆర్‌ఎస్
2014	జితేందర్‌రెడ్డి	బీఆర్‌ఎస్
2018	మన్నె శ్రీనివాస్‌రెడ్డి	బీఆర్‌ఎస్


జితేందర్‌రెడ్డి


మన్నె శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓసారి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం గురించి తెలుసుకుందాం. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటికీ హైదరాబాద్ రాష్ట్రం నిజాం ఆధీనంలో ఉండటంతో ఎన్నికలు ఆలస్యమయ్యాయి. 1952లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం 8 అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడి మొదటిసారి ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి నేటి వరకు 17 పర్యాయాలు ఎన్నికలు జరగగా.. 1952, 2014, 2019 తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. జనంపల్లి రామేశ్వర్‌రావు, మల్లిఖార్జున్ నాలుగు పర్యాయాలు మహబూబ్‌నగర్ నుంచి, మెదక్ నుంచి రెండు పర్యాయాలు ఎంపీగా గెలుపొంది రికార్డు నెలకొల్పారు. అలాగే సూదిని జైపాల్‌రెడ్డి ఒకసారి మహబూబ్‌నగర్ నుంచి, రెండుసార్లు మిర్యాలగూడ నుంచి, రెండుసార్లు రాజ్యసభకు ప్రాతినిథ్యం వహించారు. రామేశ్వర్‌రావు విషయానికొస్తే మూడుసార్లు కాంగ్రెస్ నుంచి, ఒకసారి తెలంగాణ ప్రజాసమితి నుంచి గెలుపొందారు. 2007 పునర్విభజన తర్వాత ప్రస్తుతం మహబూబ్‌నగర్, జడ్చర్ల, మక్తల్, షాద్‌నగర్, నారాయణపేట, దేవరకద్ర, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

- 2009లో పాలమూరు పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎంపీగా గెలిచారు. ప్రస్తుతం అదే పార్టీకి చెందిన మన్నె శ్రీనివాస్‌రెడ్డి కొనసాగుతున్నారు. అత్యధికంగా 10 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు మూడుసార్లు, జనతా పార్టీ అ భ్యర్థులు రెండుసార్లు, బీజేపీ, తెలంగాణ ప్రజాసమి తి అభ్యర్థులు ఒక్కోసారి ప్రాతినిధ్యం వహించారు.

ప్రజలను రెచ్చగొట్టడం తగదు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

పాలమూరు: మహబూబ్‌నగర్ ఎంపీని గెలిపించుకోలేకపోతే రేవంత్ సీఎం పదవి పోతుందని భావోద్వేగాలతో ప్రజలను రెచ్చగొట్టడం తగదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అవినీతి ఏరులై పారిందని స్వయంగా దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ ఒప్పుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి భాష చాలా అక్షేపనీయంగా, ఏవగింపుగా ఉందన్నారు. డీకే అరుణపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు తమ మరణం తర్వాత ఆస్తులను దేశానికి రాసిస్తామని మాటివ్వాలన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అయితే రామమందిరం ప్రారంభోత్సవానికి ఎందుకు రాలేదో ప్రజలకు చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ విధానాల వల్లే దేశం ఆర్థికంగా అథోగతి పాలైందన్నారు. పారదర్శకతకు మారుపేరుగా నిలిచిన మోదీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. మోదీ అనుసరిస్తున్న ఆర్థిక, విదేశాంగ విధానాల వల్లే దేశం ఐదవ స్థానానికి ఎదిగిందన్నారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నిరంజనమ్మ, పద్మవేణమ్మ, రమేష్‌కుమార్, జయశ్రీ, సాహితీరెడ్డి, కె.రాములు, రామాంజనేయులు ఉన్నారు.

ఎన్నికల వేళ.. నగదు పట్టివేత


బాలానగర్ పోలీస్ చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన నగదుతో పోలీసులు

బాలానగర్: మండల కేంద్రంలోని పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో శుక్రవారం రూ.1.18 లక్షల నగదు పట్టుబడినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ జిమ్మరాత్ బజార్‌కు చెందిన చంద్రకాంత్ కారులో బాలానగర్ వైపు వస్తుండగా తనిఖీ నిర్వహించామని, నగదు లభించడంతో సీజ్ చేసినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

చారకొండలో రూ.60 వేలు..

చారకొండ: వాహన తనిఖీలో శుక్రవారం రూ.65 వేలు పట్టుబడినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. సిబ్బందితో కలిసి ప్రధాన రహదారి, అంతర్ జిల్లా చెక్‌పోస్టు, టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీ చేస్తుండగా మండల కేంద్రానికి చెందిన అశోక్ జ్యువెలర్స్ యజమాని కారులో హైదరాబాద్ వెళ్తుండగా నగదు పట్టుబడిందని.. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎండు గంజాయి పట్టివేత


ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఎండు గంజాయి విక్రయించే వ్యక్తులు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎండు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని బోయపల్లి గేట్ సమీపంలో శుక్రవారం మోతీనగర్‌కు చెందిన మహ్మద్ రియాజ్, ప్రతాప్‌కుమార్ కలిసి 210 గ్రాముల ఎండు గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ఇద్దరూ కలిసి రెండు నెలల నుంచి హైదరాబాద్ దూల్‌పేట్ ఏరియాలో ఎండు గంజాయి తీసుకువచ్చి పాలమూరులో ఒక్కో పాకెట్‌లో ఐదు గ్రాముల చొప్పున విక్రయిస్తున్నారు. ప్రధానంగా పెయింట్ వర్కర్లు, ఆటో డ్రైవర్లు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. వీరి నుంచి పట్టణంలో ఎండు గంజాయి విక్రయించే కొంత మంది వివరాలు సేకరించామని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిర్మానుష్య ప్రాంతంలో గుంపులు గుంపులుగా కూర్చొని తాగుతున్నారని పట్టణంలో గంజాయి విక్రయించే వారితోపాటు తాగే వారిపై అనుమానం వస్తే సెల్ నం.87126 58872కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎండు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: మండల కేంద్రం నుంచి నాగసానిపల్లికి ఈ నెల 19న ఆటోలో ప్రయాణిస్తూ కిందపడి చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు అర్జునయ్య శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లికి చెందిన బత్తిని బాలస్వామి(59) ఈ నెల 19న సాయంత్రం పెబ్బేరు నుంచి ఆటోలో గ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో ఆటోలో నుండి కిందపడి గాయాలు కావడంతో చికిత్స కోసంవనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని నిమ్స్‌కు తీసుకెళ్లగా.. అక్కడే చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడని బత్తిని అర్జునయ్య ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్‌ఐ తెలిపారు.

గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం


పాన్‌గల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ప్రచార పర్వం

పాన్‌గల్/ కోడేరు: అమలు సాధ్యం కానీ హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో మరోసారి ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పాన్‌గల్‌లోని ఈదమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. గుడి నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు బైక్‌ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామని వంద రోజులైనా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారం కోసం పరితపించే నాయకుడు కావాలా.. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడు కావాలో ప్రజలే తేల్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానికుడైన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటాడన్నారు. అలాగే కోడేరులో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తమకు అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచిన రాములు పార్టీకి వెన్నుపోటు పొడిచి.. ఇప్పుడు తన కొడుకును ఎంపీగా గెలిపించాలని కోరడం సిగ్గుచేటన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పాన్‌గల్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, విండో డైరెక్టర్ బాలరాజు, కోడేరు మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, అభిలాష్‌రావు, అడ్వకేట్ రవికుమార్, వెంకటయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..? : డీకే అరుణ


మాట్లాడుతున్న పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మద్దూరు: తనను ఓడించడానికి సీఎం రేవంత్‌రెడ్డి అండ్ టీం కుట్రలు చేస్తోందని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఒక ఆడబిడ్డను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలంతా మాటల దాడి చేస్తున్నారని, అయినా భయపడేది లేదన్నారు. శుక్రవారం మద్దూరులో నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి, పాలమూరు సమగ్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, తాను గెలిస్తే మోదీ నాయకత్వంలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడమే కాకుండా రైల్వే లైన్లు తీసుకొస్తానని చెప్పారు. కొడంగల్ ప్రజలు కల్వకుర్తి నుంచి వచ్చిన నీకు రెండుసార్లు టీడీపీ ఎమ్మెల్యే గెలిపించారు.. ఈసారి కాంగ్రెస్ నుంచి గెలిపిస్తే ముఖ్యమంత్రి అయినావు.. ఇప్పటి వరకు నీవు చేసిన అభివృద్ధి, గద్వాలలో నేను అభివృద్ధిపై మీడియా సమక్షంలో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇప్పుడు దేశం కోసం జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వచ్చేది లేదని, మోదీ మూడోసారి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. తనకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక లేని పోని ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైనా సీఎం హోదాలో ఉన్న నీవు ఇలాంటి మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు నాగురావ్ నామాజీ, మదన్, శంకర్, వెంకటయ్య, రవి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మద్దతు కోరిన చల్లా వంశీచంద్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికల్లో తనకు మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సీపీఎం నాయకులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయానికి వచ్చి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. మతోన్మాద బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, లౌకిక విధానం, సామాజిక న్యాయం కోసం అన్నివర్గాల వారు సహకరించాలన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు ప్రజలను చైతన్యం చేసి ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములు, ఆయా జిల్లాల కార్యదర్శులు రాములు, జబ్బార్, జి.వెంకట్రాంరెడ్డి, పార్టీ నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, బి.చంద్రకాంత్, జి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో వాగ్దేవి ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబర్చారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు అన్విత 99.13, కీర్తన 95.92 మార్కులు సాధించారు. వీరితోపాటు సాయి భరత్, స్వప్న, సునీల్‌కుమార్, రిషిక, శివకుమార్‌లకు అత్యుత్తమ పర్సంటైల్ వచ్చాయి. వీరిని కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతూనే జాతీయ స్థాయి జేఈఈ మెయిన్స్‌కు కళాశాల విద్యార్థులు సిద్ధమై ర్యాంకులు సాధించడం గొప్ప విషయం అన్నారు. కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోటీ పరీక్షలకు సిద్ధయయ్యే విధంగా తోడ్పాటు అందించామని, దీంతో మా కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షల్లో ర్యాంకులు సాధించడం జిల్లాకే గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఐఐటీ నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, అధ్యాపకులు రాఘవేందర్‌రావు, నాగేందర్, సాకీర్, యాకుబ్, గోవిందరాజులు, లక్ష్మణ్, రాజు, మహేష్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
శనివారం ॥ 27-4-2024


ప్రతీకాత్మక చిత్రం

పరంపర

సెలవులొచ్చేశాయ్ ఫోన్ పక్కన పడేద్దామా

సెలవులొచ్చేది ఆటల కోసం, స్నేహాల కోసం బంధువుల కోసం, విహారాల కోసం, వినోదాల కోసం పిల్లలు ఇంతకాలం ఫోన్లలో కూరుకుపోయారు. వారిని ఫోన్ల నుంచి బయటకు తెండి. మీ బాల్యంలో సెలవుల్లో ఎలా గడిపారో అలా గడిపేలా చేయండి. పెద్దయ్యాక తలుచుకోవడానికి బాల్యం లేకపోవడానికి మించిన విషాదం లేదు.

ఆటస్థలాలు లేని స్కూళ్లలో చదివించడం, ఆడుకునే వీలు లేని ఇళ్లలో నివసించడం, పార్కులు లేకపోవడం, ఆడుకోవడానికి తోటి పిల్లలు లేని వాతావరణంలో జీవించడం, ఇవన్నీ ఉన్నా పిల్లలతో గడిపే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం... వీటన్నింటి వల్ల పిల్లలకు స్కూల్, ఇల్లు కాకుండా తెలిసింది ఒకే ఒక్కటి. సెల్‌ఫోన్. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారు వాటిలో కూరుకుపోతే 'అమ్మయ్య. మా జోలికి రావడం లేదు' అనుకునే తల్లిదండ్రులు ఉన్న ఈ కాలంలో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆటలు, విహారం, అనుబంధాల విలువ, కొత్త విషయాల ఎరుక ఎలా కలుగుతుంది?

అందుకే వేసవి సెలవలు ఒక పెద్ద అవకాశం. ఇరవై ముప్పై ఏళ్ల క్రితం వరకు తెలుగు ప్రాంతాలలో వేసవి సెలవులు వస్తే పిల్లలు ఎలా గడిపేవారో ఇప్పుడూ అలా గడిపే అవకాశం కల్పించవచ్చు. కాకుంటే తల్లిదండ్రులు ప్రయత్నించాలి. పిల్లలను మోటివేట్ చేయాలి.

బంధువులు- బంధాలు

బంధువులు ఎవరో తెలియకపోతే బంధాలు నిలవవు. ఎంత స్వతంత్రంగా జీవిద్దామనుకున్నా, సాటి మనుషుల విసిగింపును తప్పించుకుని తెగదెంపులు చేసుకుని బతుకుదామనుకున్నా మనిషి సంఘజీవి. అతడు బంధాలలో ఉండాల్సిందే. బంధాల వల్ల బతకాల్సిందే. పిల్లలకు బంధాలు బలపడేది, బంధాలు తెలిసేది వేసవి సెలవుల్లోనే. ఇంతకు ముందు పిల్లలు వేసవి వస్తే తల్లిదండ్రులను వదిలిపెట్టి పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య... వీళ్ల ఇళ్లకు వెళ్లి రోజుల తరబడి ఉండేవారు. వారి పిల్లలతో బంధాలు ఏర్పరుచుకునేవారు. దీని వల్ల కొత్త ఊరు తెలిసేది. ఆటలు తెలిసేవి. కలిసి వెళ్లిన సినిమా అలా ఓ జ్ఞాపకంగా మిగిలేది. ఇవాళ పెద్దల పట్టింపులు పిల్లలకు శాపాలవుతున్నాయి. రాకపోకలు లేని బంధుత్వాలతో పిల్లలు ఎక్కడకూ వెళ్లలేని స్థితి దాపురించింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత పెద్దలదే. లేకుంటే పిల్లలు ఫోన్లనే బంధువులుగా భావించి అందులోని చెత్తను నెత్తికెక్కించుకుంటారు. జీవితంలో సవాళ్లు ఎదురైన సమయంలో ఒంటరితనం ఫీలయ్యి అతలాకుతలం అవుతారు.

తెలుగు ఆటలు

సెలవుల్లో పిల్లలకు తెలుగు ఆటలు తెలియడం ఒక పరంపర. బొంగరాలు, గోలీలు,



వామనగుంటలు, పరమపదసోపాన పటం, ఒంగుళ్ల–దూకుళ్ల, నేల–బండ, ఏడుపెంకులాట, పులి–మేక, నాలుగు స్తంభాలాట, వీరి వీరి గుమ్మడిపండు, లండన్ ఆట, రైలు ఆట, పొడుపుకథలు విప్పే ఆట, అంత్యాక్షరి, కళ్లకు గంతలు... ఈ ఆటల్లో మజా తెలిస్తే పిల్లలు ఫోన్ ముట్టుకుంటారా?

కథ చెప్పకుందామా

కథలంటే పిల్లలకు ఇష్టం. పెద్దలు చెప్పాలి గాని. ఈ సెలవుల్లో రాత్రి పూట భోజనాలయ్యాక, మామిడి పండ్లు తిన్నాక, పక్కలు వేసుకుని అందరిని కూచోబెట్టి పెద్దలు కథలు చెప్తే ఎన్నెన్ని తెలుస్తాయి! ఎన్ని ఊహల కవాటాలు తెరుచుకుంటాయి. మర్యాద రామన్న, తెనాలి రాముడు, బేతాళుడు, సింద్‌బాద్, ఆలీబాబా, పంచతంత్రం, రామాయణం, మహాభారతం... భీముడిలోని బలం, అర్జునుడిలోని నైపుణ్యం... ఇవి కదా చెప్పాలి.

బలం కోసం తిండి:


పిల్లలను సరిగ్గా గమనించి వారికి కావలసిన బలమైన తిండి తినిపించడానికి వీలయ్యేది ఈ సెలవుల్లోనే. బలహీనంగా ఉండే పిల్లలు, ఎదిగే వయసు వచ్చిన ఆడపిల్లలకు ఏమేమి వొండి తినిపించాలో పెద్దల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ కాలంలో తినిపిస్తారు. శిరోజాల సంరక్షణ, చర్మ సంరక్షణ, పంటి వరుస సరి చేయించడం, జీర్ణశక్తిని ఉద్దీపన చేయడం, బంధువుల రాక వల్ల లేదా బంధువుల ఇంటికి వెళ్లడం వల్ల పిల్లలందరికీ కలిపి వారికి వృద్ధి కలిగించే ఆహారం చేసి పెట్టవచ్చు. తోటి పిల్లలు పక్కన ఉంటే ఇష్టం లేకపోయినా పిల్లలు తింటారు.

సెలవులొచ్చేది పిల్లల మానసిక, శారీరక వికాసానికి. కదలకుండా మెదలకుండా ఫోన్ పట్టుకుని కూచుని వారు ఈ సెలవులు గడిపేస్తే నింద తల్లిదండ్రుల మీదే వేయాలి... పిల్లల మీద కాదు.

గెలుపు దారి

పాకశాస్త్ర ప్రవీణ

చండీగఢ్‌కు చెందిన 23 సంవత్సరాల దేవిక మస్‌చందానీ ఇప్పుడు న్యూయార్క్‌లోని ప్రముఖ చెఫ్‌లలో ఒకరు. వంటలకు సంబంధించిన ఎన్నో పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. పేస్ట్రీ చెఫ్‌గా రకరకాల ప్రయోగాలు చేస్తూ తనదైన ప్రత్యేకత చాటుకుంటోంది.


దేవిక మస్‌చందానీ

చిన్నప్పటి నుంచి దేవికకు వంటలన్నా, కొత్త వంటకాల గురించి తెలుసుకోవడం అన్నా చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనని చండీగఢ్ వీధుల నుంచి న్యూయార్క్‌లోని ప్రసిద్ధ రెస్టారెంట్‌ల వరకు తీసుకెళ్లింది. ఆమె కుటుంబంలో, బంధువులలో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారు. వారి దగ్గరి నుంచి ఎన్నో కుటుంబ వంటకాలను నేర్చుకుంది.

వంటలపై దేవిక ఇష్టం ఎక్కడిదాకా వెళ్లిందంటే న్యూయార్క్‌లోని కలినరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికా(సిఐఎ)లో చదివే వరకు. పాకశాస్త్ర పరిధిని విస్తరించుకోవడానికి, ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ చదువు దేవికకు ఉపయోగపడింది.

'సిఐఎ'లో అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ నుంచి నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే అవార్డ్ వరకు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్' పోటీల్లో పాల్గొనడం దేవిక కెరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆ పోటీలో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా గుర్తింపు పొందింది. అంతేకాదు, ఆ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం తనని రెండు అడుగులు ముందుకు వేసేలా చేసింది. ప్రసిద్ధ 'గాబ్రియెల్' రెస్టారెంట్‌కు సంబంధించి ముఖ్యమైన ఈవెంట్స్‌కు నాయకత్వం వహించేలా చేసింది.

ఆ రెస్టారెంట్‌లో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త సవాళ్లు ఎదురయ్యేవి. క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి బాగా తెలిసిన దేవిక ఆ సవాళ్లను అధిగమించింది.

ఒక విజేతగా సిఐఏ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసే అవకాశం దేవికకు వచ్చింది. 'పాత్ వేస్ టు ఎక్స్‌లెన్స్' అంశంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసింది. 'ఎగ్జయిట్‌మెంట్‌కు ఎనర్జీ తోడైతే ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు' అంటుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్‌ఏ' రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్ణేత పాత్ర పోషించిన దేవిక 'బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్'కు సంబంధించిన పోటీకి పోటీ పడుతున్న తరువాతి తరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేసింది.

సూపర్ స్పీకర్

దేవిక మస్‌చందానీ చెఫ్ మాత్రమే కాదు స్ఫూర్తిదాయక వక్త కూడా. ఆమె వంటలతో పాటు ఉపన్యాసాలకు కూడా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. పనిచేస్తున్న క్రమంలోనే క్రైసిస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సూత్రాలు పట్టుబడతాయని చెబుతుంది దేవిక. చదువుల కోసం వేరే దేశం వెళ్లే విద్యార్థులకు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. తాను అమెరికాకు వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి. వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు చెబుతుంటుంది దేవిక.



'ఎంతో కొంత నేర్చుకున్నాను అనే తృప్తి కంటే 'ఇంకా ఎంతైనా నేర్చుకుంటాను' అనే దాహం విజయానికి దారి చూపుతుంది అంటుంది దేవిక.

'లక్ష్యం మీద అయోమయం కాదు స్పష్టత ఉండాలి' అంటున్న దేవిక ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తుంది.

పేస్ట్రీ చెఫ్ కావాలనే కలతో చండీగఢ్ నుంచి అమెరికాకు వెళ్లిన దేవిక తన కలను నెరవేర్చుకోవడమే కాదు చిన్న వయసులోనే ప్రముఖ 'పేస్ట్రీ చెఫ్'గా పెద్ద పేరు తెచ్చుకుంది.

స్త్రీ శక్తి

సముద్రంపై సాహస సంతకం



'భయంతో కాదు ప్రేమతో మాత్రమే సముద్రంలో ప్రయాణం చేయగలం' అనే మాట ఉంది. వందమందిలో ఒకరిగా సముద్రప్రయాణం వేరు. ఒకరిద్దరుగా వేరు. దిల్నా కె, రూప ఎ ఇరవై రెండు రోజుల పాటు సముద్ర ప్రయాణం చేశారు. కొన్నిసార్లు సముద్రం తన మౌన గాంభీర్యాన్ని వీడి కోపంతో గర్జించేది. ప్రశాంతం అనుకున్న సాగరంలో కల్లోలం మొదలయ్యేది. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులకూ ఈ ఇద్దరూ భయపడలేదు.

భారతీయ నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ 'ఐఎన్ఎస్వీ' తరిణితో సముద్ర సాహస యాత్రని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా ప్రత్యేకత చాటుకున్నారు. 'తరిణి' నౌకలో గోవా నుంచి బయలుదేరి 22 రోజుల తరువాత మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా సముద్రయాత్ర చేసిన దిల్నా, రూపలు శభాష్ అనిపించుకున్నారు.

ఫిబ్రవరి 28న గోవాలోని ఐఎన్ఎస్వీ మండోవి నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు బయలుదేరింది తరిణి. గమ్య స్థానానికి చేరుకున్న తరువాత రెండు దేశాల (భారత్, మారిషస్)ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాల్లో మారిషస్ కోస్టు గార్డ్‌లతో కలిసి పాల్గొన్నారు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.

'ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా నిలిచారు. వీరి విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది' అని దిల్నా, రూపలను ప్రశంసించింది నావికాదళం.

సముద్ర ప్రయాణ కాలంలో భారీ గాలులు, ప్రతికూల సముద్ర పరిస్థితుల రూపంలో దిల్నా, రూపలకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు.

'ఒక్కసారి అధైర్యపడితే ఓటమికి ఆహ్వానం పంపినట్లే.

రెండోసారి అధైర్య పడితే ఓటమి మీ గుమ్మం వరకు వచ్చినట్లే.

మరోసారి కూడా భయపడితే ఓటమి ఇంట్లోకి వచ్చినట్లే' అని శిక్షణ సమయంలో విన్న మాటను వారు బాగా గుర్తుపెట్టుకున్నారు.

సముద్రమంత సాహసం


దిల్నా


రూప

నాలుగు ప్రయత్నాల తరువాత అయిదోసారి నేవీకి ఎంపికైంది కేరళలోని కోజికోడ్‌కు చెందిన దిల్నా కె. నావికాదళంలోకి ప్రవేశించడానికి ముందు ఆర్చరీ. క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంది. నేవీ షూటింగ్ టీమ్‌లో ఒకరైన దిల్నాకు రొటీన్ యాత్రల కంటే సాహస యాత్రలు అంటే ఇష్టం. పుదుచ్చేరికి చెందిన రూప అలగిరిసామికి స్ఫూర్తి... కల్పనాచావ్లా. చెన్నైలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. సాహసాలకు మారుపేరుగా నిలిచిన మహిళల జీవితచరిత్రలు చదవడం అంటే ఇష్టం. ఈ ఇద్దరికి ప్రముఖ నావికుడు, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో అభిలాష్ టోమి (రిటైర్డ్) శిక్షణ ఇచ్చారు. ఐఎన్ఎస్వీ నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన భారతీయుడిగా టోమి రికార్డ్ సృష్టించాడు. గత సంవత్సరం దిల్నా కె, రూపలు ఆరుగురు సభ్యుల బృందంతో కలిసి గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా రియో డి జనీరోకు 188 రోజుల పాటు నౌకాయానం చేశారు.

ఈ నెల 21న గోవాలోని మండోవికి తిరిగి వచ్చిన ఐఎన్ఎస్వీ తరిణికి నావికా సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సముద్ర యాత్రకు దిల్నా, రూపలను తేలిగ్గా ఎంపిక చేయలేదు. కఠినమైన ఎంపిక ప్రక్రియతో అనేక వడపోతల ద్వారా వీరిని ఎంపిక చేశారు.

వీరి సాహసం ఇక్కడితో ఆగిపోదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న 'సాగర్ పరిక్రమ' అనే భూగోళ ప్రదక్షిణ కోసం ఈ ఇద్దరూ సన్నద్ధమవుతున్నారు.

'సాహసం' లోని విశేషం ఏమిటంటే... దానిపక్కన ఫుల్‌స్టాప్ ఎప్పుడూ ఉండదు. ఒక సాహసం మరో సాహసాన్ని ప్రేరేపిస్తుంది. విజయం సాధించేలా చేస్తుంది. 'సాగర్ పరిక్రమ'లో కూడా దిల్నా, రూపలు విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇంటి పనులతోనే రోజంతా గడిచిపోతుంటుంది
అభిరుచిని మెరుగుపరుచుకోవాలన్నా సమయమే సరిపోదనిపిస్తుంది.
కానీ, కొందరు మాత్రమే ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ
తమతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలను అందిస్తుంటారు.
ఈ కోవకే చెందుతారు సవిత ఆలంపల్లి.
తెలంగాణలోని జహీరాబాద్ వాసి అయిన సవిత
కాటన్ ఫ్యాబ్రిక్‌పైన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులతో
సహజమైన ప్రింట్లను తీసుకువస్తుంది.
అదే ఫ్యాబ్రిక్‌ని ఉపయోగిస్తూ మోడ్రన్ డ్రెస్సులను డిజైన్ చేస్తోంది.
వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ, బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేసి,
సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్‌గా తనని తాను నిరూపించుకుంటుంది.
ఆసక్తిని ఉపాధిగా మలుచుకునేందుకు చేసిన ప్రయాణంలో
తాను వేసిన అడుగుల గురించి ఆనందంగా వివరించింది.

ఆకులో ఆకునై..

ఎకో ఫ్రెండ్లీ డ్రెస్ డిజైనింగ్


సవిత


వర్క్‌షాప్

"డిగ్రీ వరకు చదువుకున్న నేను పెళ్లయ్యాక మావారు రామకృష్ణతో కలిసి అమెరికాకు వెళ్లాను. గృహిణిగానే కొన్నాళ్లు ఉండిపోయాను. న్యూయార్క్ ఎఫ్ఐటిలో ఫ్యాషన్ డిజైనింగ్‌కి సంబంధించిన కోర్స్ చేశాను. పదేళ్ల క్రితం ఇండియా వచ్చి బెంగళూరులో స్థిరపడ్డాం. రోజంతా ఇంటిపనులు, పిల్లల పనులు ఉన్నా నా కోసం కొంత సమయాన్ని కేటాయించుకునే దాన్ని. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఉపయోగించే ఫ్యాబ్రిక్ తీవ్రమైన కాలుష్యానికి గురి చేస్తుందని తెలుసుకున్నాను. అప్పటినుంచి నా వంతుగా ఏదైనా చేయాలనుకుని ప్రయత్నాలు చేస్తుండేదాన్ని. ఫ్లోర్ క్లీనర్స్, సుగంధ ద్రవ్యాలు వంటివి ఇంట్లో తయారు చేస్తుండేదాన్ని. వాటివల్ల ఇంట్లో వాళ్లు కూడా చాలా మెచ్చుకునేవారు. ఎకో ప్రింటింగ్, సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్స్ పైన వర్క్ చేయడం మొదలుపెట్టాను. ప్రకృతి ద్వారా లభించే వస్తువులతో రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తుండే దాన్ని.

ఆకులు – పువ్వులు

పూజలు, ఇతర సంప్రదాయ వేడుకలలో పువ్వులు, ఆకులను కూడా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా వాటిని ఉడకబెట్టి, టై అండ్ డై చేస్తుంటారు. నేను వాటిని ఎండబెట్టి, కొన్నింటిని తాజాగా ఉన్నప్పుడే ఫ్యాబ్రిక్ మీద చల్లి, దగ్గరగా చుట్టి, కొన్ని రోజులు అలాగే ఉంచి ప్రయోగాలు చేసే దాన్ని. ప్రయత్నాలు చేయగా చేయగా ఫ్యాబ్రిక్‌పైన రకరకాల డిజైన్స్ అమితంగా నన్ను ఆకట్టుకున్నాయి. మోదుగ, శంఖపుష్ప, పారిజాత.. వంటివే కాదు అరుదుగా పూసే పువ్వులనూ సేకరిస్తాను. వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుతాను. మామిడి, జామ, మందార ఆకులనూ డిజైన్స్‌కు వాడుతుంటాను. ఏ మాత్రం రసాయనాలు లేని ప్రయోగం ఇది.







ఇంటి నుంచి స్టూడియో వరకు

రసాయనాలతో పండించే పత్తి కాకుండా వర్షాధార పంటద్వారా వచ్చే కాటన్ ఫ్యాబ్రిక్‌ను కలెక్ట్ చేసి, నా ప్రయత్నాలను ఇంకా విరివిగా చేయడం మొదలుపెట్టాను. సస్టెయినబుల్ డ్రెస్సులు అంటే చాలావరకు వదులుగా ఉండే దుస్తులు అనుకుంటారు. కానీ, మంచి ఫిటింగ్, డిజైన్, ప్రింట్లతో ఈ తరం మెచ్చేలా డ్రెస్ డిజైనింగ్ చేయాలనుకున్నాను. కార్పొరేట్ ఉమెన్‌కు నప్పే విధంగా, అలాగే టీనేజ్ కలెక్షన్స్ కూడా ప్రిపేర్ చేస్తుంటాను. ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్, ప్రింటింగ్.. డ్రెస్సులు ధరిస్తే ఒంటికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి సొంతం అవుతుంది. ఏడెనిమిదేళ్లుగా సస్టెయినబిలిటీ మీద రకరకాల ప్రయోగాలు చేసి, ఐదేళ్ల క్రితం 'టింక్టోరియా' పేరుతో బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేశాను. ఆకులలో ఉండే జీవాన్ని టింక్టోరియా అంటారు. దానిని ఫ్యాబ్రిక్ మీదకు తీసుకురావాలని చేసిన ప్రయత్నం కాబట్టి అదే పేరును నా డిజైన్స్‌కు పెట్టాను. ఇంటినుంచి స్టూడియోదాకా మారేందుకు చేసిన రకరకాల ప్రయోగాల వల్ల ఇప్పుడు నాతో పాటు మరో ఐదుగురు మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి. మేమంతా కలిసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌కు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం పని చేస్తుంటాం.

అవగాహనకు వర్క్‌షాప్స్

ఎకోప్రింటింగ్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి హైదరాబాద్, బెంగళూరు ఇతర క్రాఫ్ట్ ఎగ్జిబిషన్స్‌లలో ఉచితంగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను. స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాను. అక్కడి వచ్చి, ఆసక్తితో నేర్చుకుంటాను అనేవారు మళ్ళీ మళ్ళీ ఫోన్ చేసి ప్రింటింగ్ ప్రాసెస్ అడుగుతుంటారు. చాలా మందికి ఆకులతోనూ, పువ్వులతోనూ డిజైన్ చేస్తారని తెలియదు. ఈ డిజైన్ ఉతికితే పోతుందేమో అనుకుంటారు. కానీ, సరైన విధంగా చేస్తే రంగు ఏ మాత్రం పోదు. ముందు కుంకుడుకాయ రసంతో ఫ్యాబ్రిక్‌ను శుభ్రం చేస్తాం. ఆ తర్వాత ఆకులను, పువ్వులను అనుకున్న డిజైన్స్‌లో అమర్చి, దగ్గరగా చుట్టి, ఆవిరిమీద ఉంచుతాం. ఆ తర్వాత బయటకు తీసి, ఒక రోజంతా అలాగే ఉంచుతాం. ఆ తర్వాత పూర్తిగా విప్పి, క్లాత్‌ని శుభ్రం చేస్తాం. సరైన డిజైన్ రావడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. షిబోరి, టై అండ్ డై, కలంకారీ డిజైన్స్‌తోపాటు నేతకారులతో ముందే మాట్లాడి ఫ్యాబ్రిక్ డిజైన్‌లో మోటిఫ్ ప్రింట్స్ వచ్చేలా గైడెన్స్ ఇస్తుంటాను. కొన్ని రకాల ఆకులు, పువ్వుల ప్రింటింగ్‌లో థ్రెడ్ వర్క్ కూడా ఉంటుంది. ప్రకృతిపైన ప్రేమ, ఇష్టంతో నన్ను నేను కొత్తగా మార్చుకునే క్రమంలో ఎంచుకున్న మార్గం ఇది. ఇంట్లో వాడాల్సిన కెమికల్స్ స్థానంలో ఏ మాత్రం రసాయనాలు లేని వస్తువులను తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాను. ఈ విధానం వల్ల ఐదారేళ్లలో నాదైన ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించుకున్నాను అనిపిస్తుంది' అని ఆనందంగా వివరిస్తారు సవిత.


మోడల్

– నిర్మలారెడ్డి